# స్ఫూర్తి

-కైపు ఆదిశేషారెడ్డి

ఒకరోజు సాయంత్రం "నాన్నగారూ! నేను చదువు మానేస్తాను" అన్నాడు టెంత్ చదువుతున్న రమేష్ తన తండ్రి గురునాథంతో.

ఆమాటతో షాకైన గురునాథం "అదేంటి రమేష్. చదువెందుకు మానేయడం?"అన్నాడు.

"నాకు చదవాలన్పించడం లేదు" అని మౌనంగా ఇంట్లోకెళ్ళిపోయాడు.

ఇక గట్టిగా అడిగినా ప్రయోజనం ఉండదని కాస్సేపటికి తనే సర్దుకుంటాడులెమ్మని ఊరకుండిపోయాడు గురునాథం.

గురునాథం ఆ చిన్నపాటి పట్నంలో ఓ చిరుద్యోగి.

తన ఏకైకపుత్రుడు రమేష్ మీద ఎన్నో ఆశలు పెట్టుకుని చదివిస్తున్నాడు. భవిష్యత్తులో గొప్పస్థాయిలో ఉద్యోగస్తుడిగా చూడాలని కలలు కంటున్నాడు.

ఆరోజుల్లో తన తల్లిదండ్రులు సరైన ఆర్థికస్థోమత లేనందువల్ల చదువు గురించి సరైన అవగాహన లేనందువల్ల తను పెద్దగా చదువుకోలేకపోయాడు.

దాంతో చిన్నపాటి ఉద్యోగంతోనే తను సరిపెట్టుకోవాల్సి వచ్చింది.

అలాంటిలోటు రమేష్‌కి కలగకుండా బాగా చదివించి ప్రయోజకుడిని చేయాలనే కోరికతో మంచి పేరున్న పాఠశాలలో చేర్పించాడు. అంతేగాక ఎప్పుడూ పట్టుదలగా, మంచిమార్కులు వస్తున్న రమేష్ ఉన్నట్టుండి చదువు మానేస్తాననగానే షాకైయ్యాడు. సర్దుకుంటాడులెమ్మని సరిపెట్టుకున్నాడు.

మరుసటిరోజు సాయంత్రం ఇంటికి వచ్చిన గురునాథంతో "ఏవండీ! బాబు ఇవాళ స్కూల్‌కి వెళ్లలేదు" అని చెప్పింది భార్య.

ఆలోచనల్లో పడ్డాడు గురునాథం.

రమేష్ అలా ప్రవర్తించడానికి ఏదో కారణం ఉండి ఉండాలి.

ఆ సమస్య తనతో చెప్పలేకపోతున్నాడు. అదేంటో తెలుసుకుంటే పరిష్కరించవచ్చు అనుకున్నాడు.

సరిగ్గా ఆ సమయంలోనే రాజారావు మాష్టారు గుర్తొచ్చారు గురునాథానికి.

రమేష్ చదివే స్కూల్‌లోనే పనిచేసే లెక్కల టీచర్ రాజారావుతో గురునాథానికి బాగా పరిచయం. ఆయన స్టూడెంట్స్‌ని బాగా ఎంకరేజ్ చేసి చదివిస్తూ ఉంటారని చెప్పుకోవడం చాలాసార్లు విని వున్నాడు.

రమేష్ సమస్యను ఆయన ముందుంచితే బాగుంటుందనిపించింది.

అలా అనుకున్నాక వెంటనే రాజారావు మాష్టారింటికి వెళ్లి విషయం చెప్పాడు.

అంతా విన్న మాష్టారు "గురునాథంగారు! మీరు వాడినేమీ కంగారుపెట్టొద్దు. నాకు వదిలేయండి నేను చూసుకుంటాను" అని చెప్పాడు.

భారాన్ని మాష్టారి నెత్తిన వేసి గురునాథం నిశ్చింతగా ఇంటికి వచ్చాడు.

ఆ తర్వాత రెండురోజులు వరుసగా స్కూల్‌కి వెళ్లలేదు రమేష్.

ఇంట్లోనే కూర్చుని టీవీ చూస్తూ, వీడియో గేమ్స్ ఆడుకుంటూ కాలం వెళ్లబుచ్చాడు. మాష్టారు చెప్పారు కాబట్టి గురునాథం ఏమీ అనలేదు.

తను స్కూల్‌కి వెళ్లకపోయినా తల్లిదండ్రులు ఏమీ అనకుండా మౌనంగా ఉండడంతో రమేష్‌ని ఆశ్చర్యానికి గురిచేసింది.

ఎప్పుడూ చదువుకోమంటూ క్లాసులు పీకేవాళ్ళు ఇలా అయిపోయారేంటి అని అనుకున్నాడు.

మూడోరోజు సాయంత్రం వాకిట్లో స్కూటర్ ఆగడంతో లేచి చూశాడు రమేష్.

స్కూటర్ దిగి ఇంట్లోకొస్తున్న రాజారావు మాష్టారిని చూడగానే ఆశ్చర్యం వేసింది లేచి "నమస్తే సార్!" అన్నాడు.

"ఏంటోయ్ రమేష్! రెండురోజుల నుంచి స్కూల్‌కి రావడం లేదు. ఆరోగ్యం బాగాలేదా?" అన్నాడు.

"లే..దు..సా...ర్" నసిగాడు రమేష్.

"సరే.. అలా వెళదాం...రావోయ్" అంటూ రమేష్‌ని పిలిచి స్కూటర్‌మీద ఎక్కించుకుని ఊరి బయట గుడి దగ్గర ఆపారు రాజారావు మాష్టారు.

ఇద్దరూ దిగి గుడి మెట్ల మీద కూర్చున్నారు.

"చూడవోయ్ రమేష్ నీలాంటి తెలివైనవాళ్ళు స్కూల్‌కి రాకపోతే నాకు చాలా బాధోయ్" అన్నారు.

తొలి అస్త్రం బలంగా తగిలింది రమేష్‌కి.

మాష్టారు తనని తెలివైనవాడిగా గుర్తించి ఇలా వెతుక్కుంటూ వచ్చాడనగానే మనసు స్పందించింది. కళ్లల్లో నీళ్ళు తిరిగాయి.

"అరె...ఎందుకా కన్నీళ్ళు? నిన్నేమన్నానని! నీలాంటి తెలివైన విద్యార్థి చదువు ఆపేస్తానంటే బాధేసింది" స్పందించిన మనసుపై సున్నితంగా మరో అస్త్రాన్ని విసిరారు మాష్టారు.

"సార్...?" బావురుమన్నాడు రమేష్.

రమేష్ భుజం తడుతూ "అసలు నీకొచ్చిన సమస్య ఏంటి? నాతోచెప్పు" అన్నాడు అనునయంగా మాష్టారు.

"సార్...!నేను ఎంత కష్టపడి చదువుతున్నా క్లాస్‌లో ర్యాంక్ పెరగడం లేదు. రాత్రింబవళ్ళు కష్టపడినా మొదటి యూనిట్‌లో పదో ర్యాంక్ వచ్చింది. రెండో యూనిట్‌లో పన్నెండుకి పడిపోయింది. లాస్ట్ ఇయర్‌లో నాలుగోర్యాంక్‌లో ఉన్న వాడిని. ఇలా ర్యాంకులు తగ్గిపోతూ ఉంటే చదవాలనిపించడం లేదు సార్" బొంగురుగొంతుతో తనలోని బాధను వెళ్లగక్కాడు రమేష్.

విషయం అర్థమైంది రాజారావు మాష్టారికి.

"సరే..స్కూటరెక్కు వెళదాం" అంటూ స్కూటర్ స్టార్ట్ చేశాడు.

మౌనంగా ఎక్కి కూర్చున్నాడు రమేష్.

మరి ఇంకేమీ మాట్లాడకుండా నేరుగా తన ఇంటిముందు ఆపారాయన. రమేష్‌ని వరండాలో కూర్చోబెట్టారు.

లోపలికెళ్లి కొన్ని కాగితాలు తెచ్చి "ఇవి చూడు" అంటూ ఇచ్చారు.

అవి ఆరుడ్రాయింగ్ షీట్లు. వరుసక్రమంలో పిన్ చేసి ఉన్నాయి.

ఒక్కొక్కటీ తిప్పిచూశాడు. మొదటి బొమ్మ నుంచి చివరిబొమ్మవరకూ.

ఒకే బొమ్మ అనేకసార్లు గీసి ఉంది.

వాటిలో కొన్ని బాగున్నాయి. కొన్ని బాగాలేవు.

అయితే చివరిబొమ్మ చాలా అద్భుతంగా ఉంది.

"చూడు రమేష్...ఇవన్నీ నేను వేసినవే. ఇది మొదటగా వేశాను. ఓ మోస్తరుగా వచ్చింది. దీనిని

రెండోసారి వేశాను. బాగా రాలేదు. ఇలా మళ్లీ మళ్ళీ వేశాను. ఇదిగో ఈ చివరిది బాగా తృప్తినిచ్చింది. తొలిబొమ్మకంటే రెండోది బాగాలేదని వదిలేసి ఉంటే చివరిబొమ్మ ఇంత అద్భుతంగా వచ్చేదా!'' చెప్పడం ఆపి రమేష్ వంక చూశారు.

మాష్టారు తనకి ఏం చెప్పదలుచుకున్నారో అర్థమైంది రమేష్‌కి.

"నీకు ర్యాంక్ తగ్గిందేగానీ మార్కులు తగ్గలేదు. అందరూ నీలాగే పోటీపడుతున్నారు. ఆరో గ్యరకమైన పోటీలో వెనకాముందూ తప్పనిసరి. కృషి పెంచాలిగానీ నిరుత్సాహపడకూడదు. ర్యాంకులు తగ్గడానికి గల కారణాలు తెలుసుకుని లోపాలుంటే సరిచేసుకుని సక్సెస్ కావాలి. కృషితో నాస్తి దుర్భిక్షం అనే సూక్తిని స్ఫూర్తిగా తీసుకో'' అన్నారు మాష్టారు.

"రేపట్నించి స్కూల్‌కి వస్తాను మాష్టారూ'' రమేష్ అన్నాడు దృఢనిశ్చయంతో.

రాజారావు మాష్టారు చిరునవ్వుతో తలూపారు.

మాష్టారికి నమస్కరించి ఇంటికి వెళ్లాడు రమేష్.

మాష్టారిచ్చిన స్ఫూర్తితో ఆ సంవత్సరం పబ్లిక్ పరీక్షల్లో స్కూల్ ఫస్ట్‌ర్యాంక్ సాధించిన రమేష్‌ని అందరూ అభినందించారు. తన అభినందనలన్నింటినీ మనస్ఫూర్తిగా మాష్టారికి అంకితం ఇచ్చాడు రమేష్.

★

